వైరల్ ఫీవర్లతో.. అప్రమత్తం

చలికాలం కావటంతో దగ్గు, జలుబు, జ్వరాల బారిన పడేవారి సంఖ్య పెరుగుతోంది. చలి తీవ్రత పెరగడంతో అనేక వ్యాధులు ప్రజానీకంపై దాడి చేస్తున్నాయి. ఏ వయసు వారైనా శీతాకాలంలో కొన్ని అనారోగ్య సమస్యలు ఎదుర్కొనక తప్పదు. సీజన్ మార్పుతో కొబ్బరితోట పీహెచ్‌సీకి జ్వర బాధితులు క్యూ కడుతున్నారు. రోజుకి కనీసం 10 మందికి పైగానే జలుబు, దగ్గు, జ్వరంతో పీహెచ్‌సీకి వస్తున్నారు. వారికి తగిన పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అక్సా పర్వీన్ తెలిపారు.



- దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతున్న బాధితులు
- కొబ్బరితోట పీహెచ్‌సీ పరిధిలో అత్యధికంగా నమోదు
- జాగ్రత్తలతోనే నివారణ సాధ్యమంటున్న వైద్యులు

అల్లిపురం: చలి తీవ్రత పెరిగి అనేక వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వాతావరణం చల్లగా ఉండటంతో హానికారక వైరస్ శరీరంలోకి ప్రవేశించి వ్యాధులకు కారణమవుతున్నాయి. ఈ కాలంలో సాధారణంగా జలుబు, దగ్గు, జ్వరం, గొంతు నొప్పి, ఫ్లూ వంటి వ్యాధులు సంభవిస్తాయి. వీటితో పాటు పలు రకాల అంటువ్యాధులు, కంటి వ్యాధులే కాకుండా ఎలర్జీలు, ఆస్తమా, సీవోడీపీ, అలర్జిక్ బ్రాంకైటిస్, నిమోనియా వంటి శ్వాసకోశ వ్యాధుల తీవ్రత పెరుగుతుంది.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి



వైద్య పరీక్షల కోసం వేచి వున్న బాధితులు

జాగ్రత్తలతోనే వ్యాధుల నివారణ..




చలికాలంలో శ్వాసకోశ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. కొబ్బరితోట పీహెచ్‌సీ పరిధిలో శ్వాస కోశ వ్యాధులు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్నారు. రోజుకి కనీసం 6 నుంచి 10 మంది వరకు వస్తున్నారు. అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నాం. వ్యాధి తీవ్రతను బట్టి కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నాం. జాగ్రత్తలతోనే వ్యాధులను నివారించగలం.
– డాక్టర్ అక్సా పర్వీన్, కొబ్బరితోట పీహెచ్‌సీ వైద్యాధికారి



కొబ్బరితోట పీహెచ్‌సీ

గొంతునొప్పి చలికాలం చాలా మందిని ఇబ్బంది పెట్టే ప్రధాన సమస్యల్లో గొంతు నొప్పి ఒకటి. సీజన్ మారే సమయంలో చాలా మందికి ముందుగా గొంతునొప్పి వస్తుంది. గొంతులో ఇన్‌ఫెక్షన్ కారక సూక్ష్మక్రిములు చేరడం వల్ల నొప్పి మొదలవుతుంది. గొంతులో గురకగా ఉంటుంది.



జలుబు శీతాకాలంలో చిన్న పిల్లలు, పెద్దవారు అనే తేడా లేకుండా వచ్చే సీజనల్ జలుబు ప్రతి ఒక్కరిని ఇబ్బందులకు గురి చేస్తుంది. ఈ కాలంలో మరీ ముఖ్యంగా చిన్న పిల్లలు తరచు జలుబు, దగ్గుతో ఇబ్బంది పడుతుంటారు. కాస్త వాతావరణం మారినా, తాగే నీటిలో మార్పు కనిపించినా, పిల్లల్లో జలుబు లక్షణాలు పెరుగుతాయి.

జ్వరం శీతాకాలంలో సాధారణంగా ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోతాయి. వైరస్‌కి వ్యాప్తి చెందే శక్తి పెరుగుతుంది. అందుకే శీతాకాలంలో వైరల్ జ్వరాలు కూడా ఎక్కువగా వస్తాయి.




ఫ్లూ శీతాకాలంలో ఫ్లూ చాలా మందిని ఇబ్బంది పెడుతుంది. రోగనిరోధక శక్తి బలహీనంగా ఉన్నవారికి ఫ్లూ వ్యాధి ఎక్కువగా వస్తుంది. ఈ వ్యాధిగ్రస్తులు తరచు ముక్కు, కళ్లు, చెవులను తాకడం మానుకోవాలి.



రక్తపరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

అస్తమా (ఉబ్బసం) ఆస్తమాతో బాధపడే వారు శీతాకాలంలో జాగ్రత్తగా ఉండాలి. గొంతు నొప్పి, కఫం, శ్వాస ఆడకపోవడం వంటివి సంభవిస్తాయి. ఇది ఉబ్బసానికి కూడా దారి తీస్తుంది. ఇటువంటి సమస్యలున్న వారు మందులను క్రమం తప్పకుండా తీసుకోవాలి.



క్లుప్తంగా

కనకమహాలక్ష్మి ఆలయంలో ఆయుష్ హోమం



ఆయుష్ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మ వారు జన్మించిన ఉత్తరా నక్షత్ర పుణ్య కాలాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆయుష్ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

హార్బర్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు



హార్బర్‌లో బోట్ల వద్ద పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. జనవరి 1వ తేదీ నుంచి ప్లాస్టిక్‌ను నిషేధించాలని అధికార యంత్రాంగం పిలుపునిచ్చింది. కాని ఫిషింగ్ హార్బర్‌లో ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారాలు కనబడుతున్నాయి. జెట్టీలో ఉన్న మరబోట్ల వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. చేపలు వేటాడిన తర్వాత వ్యర్థాలు, ఇతర సామగ్రిని సముద్రంలో పడేస్తున్నారు. సముద్రంలో వదిలేసిన వ్యర్థాలు ఒడ్డుకు చేరుకుంటున్నాయి.

మహిళల రక్షణకు పింక్ ఆర్మీ సేవలు



పింక్ ఆర్మీని ప్రారంభిస్తున్న నాదెళ్ల జ్యోతి, టాటర్ జైన్

సీతంపేట : గ్లోబల్ పింక్ ఆర్మీ విశాఖ శాఖను ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి కొత్తపల్లి జ్యోతి మాట్లాడుతూ గ్లోబల్ పింక్ ఆర్మీని సింధు మంగళవేద స్థాపించారని తెలిపారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో సేవలందిస్తున్నట్టు తెలిపారు. మహిళలు తమను తాము ఎలా రక్షించుకోవాలి, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై పింక్ ఆర్మీ అవగాహన కల్పిస్తుందన్నారు. పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు కళాశాల ప్రాంగణాల్లో మహిళల భద్రతకు, హింసను నివారించేందుకు చట్టపరంగా ఉన్న అవకాశాలను వివరిస్తూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ బీజేపీ కార్యదర్శి నాదెళ్ల జ్యోతి, గ్లోబల్ పింక్ సహ వ్యవస్థాపకుడు దీకప్ టాటర్ జైన్, రేంజర్ ఫోర్స్ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ శిడగం నాగేంద్రబాబు, సబ్ ఇన్‌స్పెక్టర్ కె.నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

యోగి వేమనకు ఘన నివాళి



వేమన విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పద్మారెడ్డి తదితరులు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఇందిరాగాంధీ పార్క్ ఆవరణలోని యోగి వేమన విగ్రహానికి కార్పొరేటర్ పద్మారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నివాళులర్పించారు. రేసపువానిపాలెం, నక్కవానిపాలెం, క్రాంతినగర్, గాంధీనగర్ పెద్దలు పాల్గొన్నారు. అనంతరం ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు.

కుటుంబ సభ్యుల చెంతకు నిరాశ్రయులు



యువకుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు



యువతీ, యువకులను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న వాసు

సీతమ్మధార: బీహార్‌కు చెందిన భూషణ్‌కుమార్ ఠాగూర్ (20) కోయంబత్తూర్ స్పిన్‌మిల్లులో పని కోసం వెళ్లాడు. అయితే అక్కడికి వెళ్లాక అతను తాగుడికి బానిస కావడంతో మానసిక ఆరోగ్యం దెబ్బతింది. ఈ నేపథ్యంలో అతను తోచిన రైలెక్కి విశాఖ వచ్చేశాడు. రైల్వేస్టేషన్‌లో పోలీసులు అతన్ని ప్రశ్నించినప్పుడు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో వారు అతన్ని ఏయూటీడీకి అప్పగించారు. వారు భూషణ్‌కుమార్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రప్పించారు. చిన్నమ్మ పూనందేవికి అతన్ని అప్పగించారు. అలాగే ఒడిశాలోని గజపతి జిల్లాకు చెందిన ఆదివాసీ యువతీ యువకులు సింహాచలం ప్రధాన్ (20), చాందిని (18) ప్రేమించుకున్నారు. పెద్దలకు తెలియకుండా ఇంట్లోంచి పారిపోయి వచ్చేశారు. వీరిని కూడా పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించి యువతి అక్క సంతోషి, యువకుడి తల్లి హీరావతికి అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్ అవగాహన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్: ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్ అవగాహన పోస్టర్‌ను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్ అంశంపై కళాకారుడు వైకే రాజు తన కళా బృందం కళాకారులచే అవగాహన కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువులు, కాలుష్యం, గుడ్డ, నార, పేపర్ సంచుల ఉపయోగం, పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ రహిత విశాఖకు సంబంధించి ఈ కళాబృందం అవగాహన కల్పించనుంది. జానపద గీతాలతో ప్రజలను చైతన్య పరిచేందుకు ఈ బృందం నగర నలుమూలల అవగాహన కల్పించనుంది. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్. సోమన్నారాయణ, స్వచ్ఛంద సంస్థల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆకుకూరలు విక్రయించే రైతులకు ఇబ్బందులు

పట్టించుకోని మార్కెటింగ్ శాఖ అధికారులు



ఆకుకూరల రైతులకు వరుసగా కేటాయించిన స్టాళ్లు

సీతమ్మధార : స్థానిక రైతుబజార్‌లో ఆకుకూరల రైతులకు కొత్త కష్టాలు వచ్చి పడ్డాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక్కడ ఆకుకూరలు విక్రయించే రైతులకు వరుసగా ఒకేచోట స్టాళ్లు కేటాయించడం తీవ్ర దుమారం రేపుతోంది. రైతుబజార్‌లో మొత్తం 30 మంది వరకు ఆకుకూరలు విక్రయించే రైతులున్నారు. ఒక రోజు 15 మంది, మరో రోజు 15 మంది వంతున రైతులు ఇక్కడికి వస్తుంటారు. వీరందరికీ ఒకే చోట పక్కపక్కనే స్టాళ్లు కేటాయించడం గమనార్హం. ఫలితంగా ఎవరికీ సక్రమంగా బేరాలు ఉండడం లేదని ఆందోళన చెందుతున్నారు. బజారు నలుమూలలా రొటేషన్ ప్రకారం స్టాళ్లు కేటాయించాలని కోరుతున్నారు. బజారులో ఇలా జరుగుతున్నా సరే జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఒకేచోట ఆకుకూరల రైతుల స్టాళ్లు ఉండడంతో చాలా మంది వినియోగదారులు ఇతర ప్రాంతాల్లో ఆకుకూరలు కనిపించలేదని వెళ్లిపోతున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా తమకు గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు. రైతుబజార్ సిబ్బంది, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఆకుకూరల రైతులు కోరుతున్నారు.

శిథిలావస్థలో సీతాకోక చిలుకల పార్కు



శిథిలమైన సీతాకోక చిలుకల పార్కు

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో సీతాకోక చిలుకల పార్కు శిథిలావస్థకు చేరింది. గతంలో ఇక్కడ సందర్శకులను కనువిందు చేసిన వివిధ రకాల సీతాకోక చిలుకలు మాయమయ్యాయి. దీంతో సందర్శకులు వెళ్లకపోవడంతో ఈ పార్కు వెలువెలబోతోంది. సాధారణంగా జూ పేరు చెప్పగానే రకరకాల పక్షులు, ఎన్నో జాతుల జంతువులు గుర్తుకు వస్తాయి. జూకి వెళ్లే సందర్శకులకు వాటి నుంచి వినోదంతోపాటు విజ్ఞానం లభిస్తోంది. ఇక్కడ జూ అధికారులు మాత్రం సందర్శకులకు వాటితోపాటు మరింత వినోదం కోసం సీతాకోక చిలుకలను అందుబాటులోకి తీసుకురావాలని 2010లో బయోస్కోప్ సమీపంలో నీటి ఏనుగుల ఎన్‌క్లోజరు ఎదురుగా సుమారు 1,000 చదరపు గజాల విస్తీర్ణంలో సీతకోక చిలుకల పార్కు ఏర్పాటు చేశారు. ఈ పార్కులో రకరకాల సీతాకోక చిలుకలను ఉత్పత్తి చేశారు. దీంతో ఇక్కడకు వెళ్లే సందర్శకులకు రంగురంగుల చిలుకలు కనువిందు చేసేవి. ఈ చిలుకలు బయటకు ఎగిరిపోకుండా ఇనుప మెస్‌తో పైకప్పు ఏర్పాటు చేశారు. దానిలో చిన్న రంధ్రాల నుంచి గాలి, వెలుతురు వెళ్లే ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనుమరుగైంది. ఈ పార్కు శిథిలావస్థకు చేరి సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్నా జూ అధికారులు పట్టించుకోలేదు. దీని లోపల సందర్శకులను కనువిందు చేసే ఫౌంటైన్ మూగబోయింది. ఇప్పుడు ఆ ఫౌంటైన్ పనిచేయడం లేదు. దాని చుట్టూ వివిధ రకాల పూల మొక్కలు, సీతకోక చిలుకలకు ఆహారం కోసం మధుర రసాలను ఇచ్చే మొక్కలు ఎండిపోయాయి. పార్కు పైకప్పు శిథిలమైంది. పైకప్పు మీద వేసే మెస్ పూర్తిగా చిరిగిపోయింది. దీని ద్వారానికి అమర్చిన మెస్‌ది కూడా అదే పరిస్థితి. ఈ పార్కు శిథిలం కావడంతో ఇందులో చిలుకలు బయటకు ఎగిరిపోయాయి. ఈ పార్కును పునర్నిర్మించాలని జూ అధికారులను సందర్శకులు కోరుతున్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా గోబ్యాక్

వామపక్ష పార్టీల నిరసన



జీవీఎంసీ గాంధీ పార్కులో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

సీతమ్మధార: భారత రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్‌పై రాజ్యసభలో అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విజయవాడ పర్యటన నుండి వెనక్కి పోవాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. 19న రాష్ట్రవ్యాప్త నిరసనలకు వామపక్ష పార్టీలు పిలుపునిచ్చిన నేపథ్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ (న్యూడెమొక్రసీ), సీపీఐ ఎంఎల్ ప్రజాపోరు పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు జి.ఎస్.అచ్యుతరావు, న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, ప్రజాపోరు జిల్లా కార్యదర్శి దేవాలు మాట్లాడారు. 75వ రాజ్యాంగ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యసభలో ప్రతిపక్ష పార్టీలు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి సవరణలు చేసేందుకు పూనుకోవడం, రాజ్యాంగ హక్కులను హరించడం సరైంది కాదని నినదించడంతో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను అభిమానించే వారిని ఎగతాళి చేస్తూ మాట్లాడారన్నారు. అంబేడ్కర్ జపం చేయడం ఫ్యాషన్‌గా మారిందని, ఆయన జపం కన్నా దేవుడిని తలచుకుంటే స్వర్గమన్నా వచ్చేదంటూ వ్యాఖ్యానించడం దురదృష్టకరమన్నారు. ప్రధాని కూడా అమిత్‌షాను వెనకేసుకు రావడం దేశానికే అవమానకరమన్నారు. దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా బీజేపీ వైఖరిలో మార్పులేదని దుయ్యబట్టారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవి చేపట్టిన మతోన్మాదులకు అంబేడ్కర్ అంటే ఎందుకంత భయం అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అన్ని తరగతులు, వర్గాల ప్రజానీకం, సామాజిక, ప్రజాసంఘాలు కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టినా చంద్రబాబు, పవన్ కల్యాణ్, కూటమి పెద్దలు ఏమాత్రం నోరు మెదపకపోగా విజయవాడకు వచ్చిన అమిత్‌షాకు స్వాగతం పలకడం సరైంది కాదన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు దళితుల పట్ల, రాజ్యాంగ విలువల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. తక్షణమే అమిత్‌షాను ఏపీ నుండి వెనక్కి పంపాలని, రాష్ట్రంలో పర్యటనలకు అనుమతించరాదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ, జిల్లా కమిటీ సభ్యులు బొట్టా ఈశ్వరమ్మ, డి.అప్పలరాజు, కుమార్, ఎం.సుబ్బారావు, వై.రాజు, మాధవి, కె.కుమారి, సీపీఐ నాయకులు చంద్రశేఖర్, రెహ్మాన్, బేగం తదితరులు పాల్గొన్నారు.

గుడివాడకు అభినందనలు



అమర్నాథ్‌కు అభినందనలు తెలుపుతున్న శివరామకృష్ణ, రామన్నపాత్రుడు తదితరులు

డాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్‌ను పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం చోడవరం నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడంపై అభినందనలు వెల్లువెత్తాయి. పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు బోని శివరామకృష్ణ, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంట్రెడ్డి రామన్నపాత్రుడు, మైనార్టీ నాయకుడు దేవరకొండ మార్కండేయులు, పలువురు నాయకులు ఆదివారం అమర్నాథ్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

వెంకన్న సన్నిధిలో అన్న సమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న ఈవో రమాబాయి తదితరులు

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఈవో జీవీ రమాబాయి ప్రారంభించారు. తొలుత బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు. అన్నసమారాధన కార్యక్రమంలో వెంకటేశ్వరమెట్ట, బంగారుమెట్ట, గోవిందరోడ్డు, సాయిబాబావీధి, మిరపకాయలవీధి, సింహాలదేవిడి ప్రాంతాల భక్తులతో పాటు జీకే ఫౌండేషన్ ప్రతినిధులు భీశెట్టి గోపీకృష్ణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

పప్పు దోసకాయలకు గిరాకీ



రైతుబజార్‌లో విక్రయిస్తున్న దోసకాయలు

సీతమ్మధార : సీతమ్మధార రైతు బజారులో పప్పు దోసకాయలకు గిరాకీ పెరిగింది. ఈ దోసకాయలు విభిన్న రంగుల్లో వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. ఈ కాయలను కిలో రూ.35 వంతున విక్రయిస్తున్నారు. పెందుర్తి మండలం చింతగట్లకు చెందిన రైతు ముత్యాలమ్మ సీతమ్మధారలో గల రైతు బజార్లో విక్రయిస్తున్నారు. ఈ బజారులో దోసకాయల రైతులు అందరూ కలిపి రోజుకి సుమారుగా 50 కిలోల వరకు సరకు విక్రయిస్తున్నారని సిబ్బంది తెలిపారు. వంటలో పప్పుతో కలిపి దోసకాయ వినియోగించడం తెలిసిందే.

22న అక్కయ్యపాలెం పరస



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్ తదితరులు

సీతంపేట : గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో 22 బుధవారం భూలోకమాంబ, ముత్యమాంబ, కుంచుమాంబ, వేంకటేశ్వరస్వామి, సీతారాముల పరస మహోత్సవం అక్కయ్యపాలెంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం సాయంత్రం అక్కయ్యపాలెం మూడు గుళ్ల వద్ద సంఘం అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 5 గంటలకు అమ్మవార్ల ప్రథమ పూజతో పరస ఉత్సవం ప్రారంభమవుతుందన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 వరకు తప్పెట గుళ్లు, సేవా గరిడీ, కోలాటం వంటి అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుత్ దీపాలంకరణతో పరస కనులపండువగా నిర్వహిస్తామన్నారు. ప్రజలంతా పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని, పరసను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు పి.ఎస్.జె.వి.ప్రసాద్, కమిటీ ఛైర్మన్ రాజగిరి అప్పలరాజు, వైస్ ఛైర్మన్ మళ్ల త్రినాథరావు, డిప్యూటీ ప్రెసిడెంట్ పిళ్లా పకీరునాయుడు, కార్యదర్శి ఆదారి పారుపల్లి రవి, ఉపాధ్యక్షుడు బొడ్డేటి ఆనందరావు, కోశాధికారి పెంటకోట సత్యప్రసాద్, పిల్లా గోపి, పాలమరశెట్టి ఈశ్వర అప్పారావు, మాదేటి శ్రీనివాసరావు, వీరుబాబు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తిరుగు ప్రయాణంతో సందడి



సీతంపేట : సంక్రాంతి సెలవులు ముగియడంతో దూర ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారు తిరుగు పయనమయ్యారు. ఉన్నత చదువులు, ఉద్యోగ రీత్యా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి దూర ప్రాంతాల్లో ఉన్న వారు సంక్రాంతికి విశాఖ వచ్చారు. పండగ సెలవులు ముగియడంతో ఆదివారం తమ నగరాలకు పయనమయ్యారు. దీంతో రామాటాకీస్ వద్ద ప్రైవేటు ట్రావెల్ బస్సుల వద్ద రద్దీ నెలకొంది. ఉదయం 11 గంటల నుంచి ట్రావెల్ బస్సులు బారులు తీరాయి. బస్సులు ఎక్కడానికి వచ్చిన వారు, వారిని సాగనంపడానికి వచ్చిన వారితో రామాటాకీస్ రోడ్ సందడిగా మారింది.

వేమన పద్యాలు జీవన సత్యాలు

ఏయూ క్యాంపస్ : వేమన పద్యాలు నిత్య జీవన సత్యాలని పలువురు వక్తలు అన్నారు. బీచ్‌రోడ్డులో యోగి వేమన విగ్రహం వద్ద శ్రీ వేమన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ముందుగా యోగి వేమన విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు వారి నాలుకపై వేమన పద్యాలు నిత్యం వినిపిస్తాయన్నారు. వేమన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు గుడిమెట్ల మధుకుమార్ మాట్లాడుతూ విశ్వదాభిరామ వినురవేమ పద్యం చదవని వారు, వినని తెలుగు వారు ఉండరన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి సత్తి నాగేశ్వర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, నాయకులు కొయ్య ప్రసాద రెడ్డి, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, కాలయ సూరా రెడ్డి, ఆచార్య తిమ్మ రెడ్డి, తాత రెడ్డి, డి.నారాయణ రెడ్డి, సత్తి రామ కృష్ణా రెడ్డి, సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.